## క్లుప్తంగా

### ఖాదర్‌లింగస్వామి దర్గాలో భక్తుల సందడి


దర్గాలో ఫాతెహాలు చేస్తున్న భక్తులు

కౌతాళం: మండల కేంద్రమైన కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన జగద్గురు ఖాదర్‌లింగ స్వామి దర్గాకు గురువారం భక్తుల సందడి నెలకొంది. భక్తులు దర్గాను దర్శించుకుని ప్రత్యేక ఫాతెహాలు నిర్వహించారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్‌బాషా చిష్తీలు స్వామి సమాధికి గంధంతో పూసి ప్రత్యేక ఫాతెహాలు చేపట్టారు. అనంతరం భక్తుల్ని దర్శనానికి వదిలారు.

### రైలు కింద పడి వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న గుర్తు తెలియని వ్యక్తి

ఆదోని సెంట్రల్: ఆదోని పట్టణంలో గుర్తు తెలియని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. గురువారం ఇస్వీ–ఆదోని ఆర్‌ఎస్‌ల మధ్యలో కిలోమీటరు నంబర్ 495/19–21 అప్‌లైన్ ట్రాక్ వద్ద ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని వయసు 35 సంవత్సరములు ఉంటాయి. మృతుడు ఎర్రచొక్క, బ్లూ కలర్ ప్యాంట్ ధరించాడు. షర్టు కాలర్‌కు మెజస్టిక్ మెన్స్ వేర్ ఆదోని టైలర్ స్టిక్కర్ ఉంది. గుర్తుపడితే సమాచారం అందించాలని రైల్వే ఎస్‌ఐ రామస్వామి తెలిపారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

### మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య


ఆత్మహత్య చేసుకున్న లింగన్న

పెద్దకడబూరు : తాగుడుకు బానిసై మద్యానికి డబ్బులు ఇవ్వలేదని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల పరిధిలోని కంబలదిన్నెలో గురువారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ మహేష్‌కుమార్ తెలిపిన వివరాల మేరకు కంబలదిన్నె గ్రామానికి చెందిన కురువ లింగన్న కుమారుడు తిమ్మప్ప(70) ప్రతిరోజు ఇంట్లో వారితో గొడవపడి డబ్బులు తీసుకొని తాగేవాడన్నాడు. గురువారం కూడా తాగడానికి డబ్బులు కావాలని కొడుకులను అడగగా వారు లేవని వారించారు. మనస్థాపానికి గురైన లింగన్న పొలం దగ్గరకు వెళ్లి పురుగు మందు తాగారన్నారు. గమనించిన ఇరుగుపొరుగు వారు కుటుంబ సభ్యులకు సమాచారం చేరవేయడంతో ఎమ్మిగనూరు ప్రభుత్వాసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో చనిపోయాడన్నారు. కుమారుడు కర్రెప్ప వివరాల ఫిర్యాదు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.

### రైతుబజార్‌లో కిలో టమాట రూ.50


టమాట తీసుకునేందుకు పోటీ పడుతున్న జనం

ఆదోనిటౌన్ : ఆదోని రైతుబజార్‌లో గురువారం సబ్సిడీపై కిలో రూ.50కే టమాట ను విక్రయించారు. వారంలో రెండుసార్లు ప్రభుత్వం సబ్సిడీలో విక్రయిస్తుందని మార్కెట్‌యార్డు చైర్మన్ మజార్‌అహ్మద్, ఎస్టేట్ ఆఫీసర్ అశోక్‌కుమార్ తెలిపారు

### కర్నూలుకు వెళ్లి పింఛన్ అందజేసిన వలంటీర్లు


లక్ష్మమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ సాయి

ఆదోనిటౌన్ : ఆదోని మున్సిపాలిటీలోని 24, 38 వార్డుల్లోని పింఛన్‌దారులు అనారోగ్యం కారణంగా కర్నూలులోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్న పింఛన్‌దారులకు వలంటీర్లు కర్నూలుకు వెళ్లి పింఛన్‌లను అందజేశారు. క్రాంతినగర్‌కు చెందిన నారాయణప్పకు రెండు కాళ్లకు ఇన్‌ఫెక్షన్ కావడంతో కర్నూలు విశ్వభారతి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. వలంటీర్ రూప గురువారం కర్నూలుకు వెళ్లి నారాయణప్పకు పింఛన్‌ను అందజేసింది. 38వ వార్డు వలంటీర్ శివ కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రిలో అడ్మిట్ అయిన మోచే రత్నమ్మకు వృద్ధాప్య పింఛన్‌ను అందజేశాడు.

### బీజేపీ మండల కమిటీ ఎన్నిక

కోసిగి: కోసిగి మండలం బీజేపీ నూతన కార్యవర్గ కమిటీని మంత్రాలయం నియోజకవర్గ ఇన్‌చార్జ్ పురుషోత్తం రెడ్డి ఆధ్వర్యంలో ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండల అధ్యక్షుడుగా పెండేకల్ చిన్న రాముడిని రెండవసారి ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా కురువ మారెన్న, మజ్జిగ సిద్దప్ప, పెండేకల్లు నరసమ్మ, తమ్మారెడ్డి, జనరల్ కార్యదర్శి గోతుల దొడ్డి తిక్కయ్య, మజ్జిగ ఉసేని, కార్యదర్శులుగా గుడిసె అయ్యమ్మ, దిన్నె చంద్ర, పింజరి మహబూబ్ బాషా ఎంపికయ్యారు.

# కండ్ల 'కలక'లం!

- ప్రభుత్వ ఏరియాఆస్పత్రిలో రోజుకు 60–70 కేసులు
- భయాందోళన చెందుతున్న ప్రజలు
- అప్రత్తంగా ఉండాలంటూ వైద్యుల సూచన


కండ్లకల వస్తే కళ్లు ఇలా ఎర్రగా మారుతాయి


ప్రభుత్వ ఆస్పత్రి ఓపీ వద్ద కిక్కిరిసిన రోగులు

ఆదోనిఅర్బన్ : కండ్ల కలక ఒకప్పుడు సాధరణ వ్యాధి. నేడు కలకలం సృష్టిస్తుంది. ప్రజలు భయాందోళనకు గురువుతున్నారు. రెండు వారాలుగా ప్రభుత్వ, ప్రైవేట్ ఆసుపత్రులకు కండ్లకలకం రోగులు క్యూకడుతున్నారు. ఆదోని నియోజకవర్గంలో ప్రభుత్వ ఏరియా ఆస్పత్రితోపాటు స్త్రీ, చిన్నపిల్లల ఆస్పత్రులు ఉన్నాయి. అంతేగాకుండా ఆరు పీహెచ్‌సీలు, ఆరు అర్బన్‌హెల్త్ సెంటర్‌లు ఉన్నాయి. అందులో నాలుగు పీహెచ్‌సీలో పట్టణంలోనూ, రెండు పెద్దతుంబళం, పెద్దహరివాణంలో ఉన్నాయి. ఏరియా ఆస్పత్రిలో గత 15 రోజుల నుంచి రోజుకు 60 నుంచి 70 కేసులు కండ్లకలకతో చికిత్స కోసం కేసులు వస్తున్నాయి. అదేవిధంగా స్త్రీ, చిన్నపిల్లల ఆస్పత్రిని కండ్లకలక సోకిన చిన్నారులు ఆశ్రయిస్తున్నారు. ప్రతి పీహెచ్‌సీ, అర్బన్‌హెల్త్ సెంటర్‌లలో రోజుకు ఆరు నుంచి పది వరకు కండ్లకలక వ్యాధితో చికిత్సకు వస్తున్నట్లు వైద్యులు చెబుతున్నారు ఈ యేడాది వేసవి సుదీర్ఘంగా కొనసాగింది. ఉక్కపోతతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఒక్కసారిగా వర్షం కురువడంతో ప్రజలు ఉపశమనం పొందినప్పటికీ ఉక్కపోత వదలలేదు. వాతావరణ మార్పుల మూలంగానే కండ్లకలకం విజృంభించిందనే వాదనలేకపోలేదు. ఈ వ్యాధి ఒక వ్యక్తి నుంచి కనీసం ఆరుగురికి వ్యాప్తి చెందుతుందని వైద్యులు చెబుతున్నారు. బాధితులు బాధ్యతగా వ్యవహరిస్తే కండ్ల కలకను అరికట్టడం సులువేనని అంటున్నారు. జనసమూహాల్లో జాగ్రత్తగా ఉండాలని, విద్యాలయాల్లో పిల్లలకు సోకితే తల్లిదండ్రులు విద్యార్థులను బడికి పంపకుండా ఉంచడం మంచిదని చెబుతున్నారు వైద్యులు.

**కండ్లకలక లక్షణాలు**

మొదట కన్ను లోపలి భాగం ఎర్రగా మారుతుంది. కన్ను వాపు వస్తుంది. దురదగా అనిపిస్తుంది. కంటి నుంచి అదే పనిగా నీరు కారుతుంది. పూసులు కట్టడం, తెరవలేనంతగా మూసుకుపోవడం, కంటి నొప్పి వంటివి కండ్లకలక లక్షణాలు.

**నివారించడం ఇలా....**

- కోవిడ్ తరహాలో ఐసోలేషన్, భౌతికదూరంతో ఈ వ్యాధి వ్యాప్తికి అడ్డుకట్ట వేయవచ్చు.
- కండ్లకలక వచ్చిన కళ్లను నేరుగా చేతితో తాకడం, నలపడం చేయరాదు.
- తడివస్త్రం లేదా దూదితో కళ్లను శుభ్రం చేసుకోవాలి.
- కండ్లకలక ఉంటే రోజుకు కనీసం ఆరుసార్లు సబ్బు నీటితో శుభ్రం చేయాలి.
- సబ్బు రసాయనాలు కంటి లోపలికి వెళ్లకుండా జాగ్రత్త పడాలి.
- బాధితులు వాడే దుప్పట్లు, దిండ్లు, టవాళ్లు, రుమాళ్లు, సబ్బులను మరెవ్వరూ వాడరాదు.
- తప్పని పరిస్థితుల్లో బయటకు వెళ్లాల్సి వస్తే తప్పకుండా కళ్లను పూర్తిగా కప్పి ఉంచే కళ్ల అద్దాలను ధరించాలి.

**సొంత వైద్యం వద్దు**



కండ్లకలక వ్యాధి వచ్చినప్పుడు సొంతంగా వైద్యం చేసుకోవద్దు. కళ్లు దురద వచ్చిందంటే వెంటనే వైద్యుడిని సంప్రదించాలి. ఏవేవో మందులు, డ్రాపులు వాడి ఎంతో సూక్ష్మంగా ఉన్న కళ్లను పోగొట్టుకోవద్దు. కళ్లల్లో కళ్లు పెట్టి చూస్తే ఈ వ్యాధి వ్యాప్తి చెందదు. ఎంతో సూక్ష్మంగా ఉన్న కళ్లను జాగ్రత్తగా చూసుకోవాలి. ప్రభుత్వ ఆస్పత్రిలో కండ్లకలకకు సంబంధించిన డ్రాపులు, మందులు ఉన్నాయి.
– డాక్టర్ పద్మకుమార్, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి కంటి వైద్యనిపుణుడు

**పీహెచ్‌సీలలో మందులు ఉన్నాయి**



ప్రభుత్వ ఆస్పత్రుల్లో కండ్లకలక వ్యాధికి సంబంధించి మందులు, డ్రాపులు ఉన్నాయి. ప్రతిరోజూ ఐదు నుంచి ఏడు మంది వరకు చికిత్స కోసం వస్తున్నారు. వైద్యుల సలహాలతోనే మందులు, డ్రాప్‌లను వాడాలి. ఇష్టం వచ్చినట్లు సొంతంగా మందులు, డ్రాప్స్ వాడితే కంటిచూపుపై ప్రమాదం ఉంది. అంటువ్యాధి అయినందును వ్యాధి సోకిన వారు బయటకు రాకుండా ఉంటే మంచిది.
– డాక్టర్ సత్యవతి, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌ఓ

**అపోహలు నమ్మవద్దు**



కండ్లకలక వ్యాధి కరోనా కాదు. అపోహలను నమ్మొద్దు. కరోనా అయితే జ్వరం, దగ్గు, జలుబు ఉంటుంది. ఇది ఎడినోవైరస్. సాధారణంగా ఇది తెల్లగుడ్డును ప్రభావితం చేస్తుంది. దీనికి బయట దొరికే థెరాయిడ్‌ను వాడరాదు. వాడితే సమస్య జటిలమవుతుంది. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రోజుకు 40 నుంచి 50 వరకు కేసులు వస్తున్నాయి. జాగ్రత్తలు పాటించడమే మన కళ్లకు శ్రీరామరక్ష.
– డాక్టర్ క్రిష్ణమూర్తి, వైఎస్సార్‌సీపీ జిల్లా వైద్యవిభాగం అధ్యక్షుడు

### నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

కోసిగి: మండల పరిధిలోని కందుకూరు, కొల్మాన్ పేట, వందగల్లు గ్రామాల విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని పంట పొలాలకు శుక్రవారం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపి వేస్తున్నట్లు ట్రాన్స్ కో ఏఈ వీరేష్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బసలదొడ్డి ఫీడర్ పరిధిలోని పెద్దతుంబళం క్రాస్ నుంచి కోసిగి రైల్వే గేటు వరకు కొత్తగా విద్యుత్ స్తంభాలు ఏర్పాటు లైన్ వేసినట్లు తెలిపారు. అయితే ఆ లైన్‌కు విద్యుత్ సరఫరా ఇచ్చేందుకు బ్రేకర్ ఏర్పాటు చేసి ఆన్ ఆఫ్ చేసేలా పనులు చేయిస్తున్నామన్నారు. దీంతో ఆయా పరిధిలోని పంట పొలాలకు త్రీఫేస్ విద్యుత్ సరఫరా బంద్ చేయిస్తున్నామని, రైతులు సహకరించాలని కోరారు.

### ఇంటిగ్రేటెడ్ హాస్టల్‌లో వలస పిల్లలకు అవకాశం కల్పించండి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో ఇంటి గ్రేటెడ్ హాస్టల్‌లో స్థానికంగా నివాసం ఉండి వలస వెళ్లే కుటుంబాల పిల్లలకు వసతి సౌకర్యం కల్పించాలని బాలుర ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం ఖలీల్ అహ్మద్ ఎమ్మెల్యే బాలనాగిరెడ్డిని కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యేను కలిసి వలసలకు వెళ్లే కుటుంబాల పిల్లల సమస్యలను విన్నవించారు. జిల్లా బీసీ వెల్ఫేర్ సాంఘిక సంక్షేమ అధికారి నుంచి అనుమతి ఇప్పించేలా చూడాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే లెటర్ రాసి ఇచ్చారు. త్వరలో అనుమతులు వచ్చేలా చూడాలని కోరినట్లు ఇన్‌చార్జ్ హెచ్‌ఎం తెలిపారు.

## వివాదాలకు తావులేకుండా సర్వే చేయాలి

- ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి


గ్రామ మ్యాప్‌ను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి.

మంత్రాలయం: గ్రామీణ ప్రాంతాల్లో జరుగుతున్న రీ సర్వేలో భూ వివాదాలకు తావు లేకుండా పనులు చేయాలని మంత్రాలయం ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని 52బసాపురం గ్రామంలో జరుగుతున్న రీ సర్వే పనులకు సంబంధించిన మ్యాప్‌ను ఎమ్మెల్యేకు చూపించి హద్దులను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో పెద్దల ఆస్తి పంపకాలు, కొనుగోలు, అమ్మకాలు జరిపిన భూముల రీ సర్వే విషయంలో ఇరువర్గాలు ఒప్పందం మేరకు సరిహద్దులు నిర్ణయించాలని సర్వేయర్లు హరికృష్ణ, శేఖర్‌నాయక్, తిమేష్‌ను ఆదేశించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ జి.భీమారెడ్డి, సర్పంచ్ రాఘవరెడ్డి తదితరులు ఉన్నారు.

**దేవాలయాలను సందర్శించిన ఎమ్మెల్యే**

మండల పరిధిలోని తుంగభద్ర గ్రామంలో వెలసిన శ్రీ రాఘవేంద్రస్వామిని, 52బసాపురం గ్రామంలో వెలసిన సాయిబాబాను గురువారం మంత్రాలయం ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి దర్శించుకున్నారు. స్వామివార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఎమ్మెల్యేకు అర్చకులు తీర్థ ప్రసాదాలను అందజేసి ఆశీర్వాదించారు.

### అనుమానిత ఇళ్లల్లో సోదాలు

- రికార్డులు లేని 12 బైక్‌లు సీజ్


రికార్డులు లేని వాహనాలను సీజ్ చేసి చూపుతున్న సీఐ ఎరిసా వలి

కోసిగి: మండల కేంద్రం కోసిగిలో డీఎస్పీ సీతారామయ్య ఆధ్వర్యంలో నలుగురు సీఐలు, ఆరుగురు ఎస్‌ఐలు, 30 మంది పోలీస్ సిబ్బంది ఆరు బృందాలుగా ఏర్పడి అనుమానిత ఇళ్లల్లో సోదాలు చేపట్టారు. గురువారం వేకువ జామున 5 నుంచి ఉదయం 7గంటల వరకు కోసిగిలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. రౌడీ షీటర్లు, సారా, అక్రమ మద్యం విక్రేతలు ఇళ్లల్లో తనిఖీలు చేపట్టారు. అలాగే ఆర్టీసీ, బస్టాండ్ రైల్వే స్టేషన్‌లలో సోదాలు నిర్వహించారు. పలు కాలనీల్లో తనిఖీలు చేస్తుండా రికార్డులు లేని 12 వాహనాలను గుర్తించి సీజ్ చేసినట్లు సీఐ ఎరిసా వలి, ఎస్‌ఐ సతీష్ కుమార్ తెలిపారు.

## వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్ల పంపిణీ


కిట్లు పంపిణీ చేస్తున్న నాయకులు


కిట్లను పంపిణీ చేస్తున్న దృశ్యం


పౌష్టికాహార కిట్లు అందజేస్తున్న దృశ్యం

మంత్రాలయం: గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత తగ్గించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు మంత్రాలయం సర్పంచ్ తెల్లబండ్ల భీమయ్య అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంల వద్ద ఐసీడీఎస్ తరుపున గర్భిణులకు, బాలింతలకు వైఎస్సార్‌పోషణ కిట్లు పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వ్యవసాయసలహా మండలి సభ్యులు కురువ మల్లికార్జున, వైస్ ఎంపీపీ పులికుక్క రాఘవేంద్ర, ఉపసర్పంచ్ హోటల్ పరమేష్, సచివాలయ కో కన్వీనరు వీకేసీ రాఘవేంద్రాచారి, నాయకులు కృష్ణాస్వామి, జనార్దన్‌రెడ్డి, శివకుమార్, సీహెచ్‌వోలు పీరానాయక్, రేష్మ, జయంతి, మహిళ పోలీసు చంద్రకళ, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, కల్యాణి, ప్రమీలమ్మ, భీమేశ్వరి, శ్వేత పాల్గొన్నారు.

**మంత్రాలయం రూరల్:** స్థానిక పంచాయతీ కార్యాలయంలో గురువారం గర్భిణులు, బాలింతలకు సర్పంచి భీమయ్య, ఉప సర్పంచి పరమేశ్‌స్వామి వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు గోరుకల్లు కృష్ణస్వామి, మల్లికార్జున, శివప్ప, జనార్ధన్‌రెడ్డి, వీకేసీ రఘు, మండల ఉపాధ్యక్షుడు రాఘవేంద్ర, రామంజి, అంగన్‌వాడీ టీచర్లు స్వప్న, కల్యాణి, ప్రమీలమ్మ, భీమేశ్వరి, స్వేత తదితరులు పాల్గొన్నారు.

**కోసిగి:** తల్లీ బిడ్డల సంరక్షణే ప్రభుత్వ ధ్యేయం కోసిగి మేజర్ గ్రామ సర్పంచ్ కుమారి అయ్యమ్మ పేర్కొన్నారు. గురువారం కోసిగి కడపాళెం ఎస్సీ కాలనీల్లో అంగన్‌వాడీ కేంద్రం వద్ద వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లను గర్భిణులు, బాలింతలకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో అంగన్ వాడీ కార్యకర్తలు పద్మ, వెంకటమ్మ , ఆశావర్కర్లు, తదితరులు పాల్గొన్నారు.

### సన్మానం

ఆదోని రూరల్ : ఇటీవల పెద్దకడబూరు, కోసిగి ఎంఈఓలుగా బాధ్యతలు చేపట్టిన రామమూర్తి, నాగేశప్ప, హెచ్‌ఎంగా పదోన్నతి పొందిన సుబ్బారెడ్డితో పాటు 18 పీడీలుగా పదోన్నతి దక్కించుకున్న ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ మేరకు గురువారం స్థానిక మున్సిపల్ హైస్కూల్‌లో ఏపీ పీఈటీలు మరియు ఎస్‌ఏపీఈ అసోసియేషన్ ఆదోని జోన్ ఆధ్వర్యంలో వారికి దుశ్శాలువాలు, పూలమాలలు వేసి ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఏపీ పీఈటీస్ అండ్ ఎస్ఏ పీఈ అసోసియేషన్ చీఫ్ పాటర్న్ గోపాల్‌రెడ్డి, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, కృష్ణారెడ్డి, ఫయాజ్, ఖలీల్‌అహ్మద్, పీడీ నరసయ్య, సీనియర్ పీఈటీ ఈరన్న, ఆరేకల్ పీఈటీ వెంకటేష్, నరసింహారాజు తదితరులు పాల్గొన్నారు.


పదోన్నతి పొందిన ఎంఈఓలు, ఉపాధ్యాయులను సన్మానిస్తున్న నాయకులు

## ఆదోని నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యం

- ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


అమరావతినగర్‌లో మహిళలను సమస్యలను అడిగి తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి


షరాఫ్‌బజార్‌లో ప్రజలతో మాట్లాడుతున్న మనోజ్‌కుమార్‌రెడ్డి

ఆదోనిటౌన్ : ఆదోని నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగాతున్నామని, అన్ని విధాలా తీర్చిదిద్దేందుకు అంకితభావంతో కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం, వార్డుల్లో ప్రజలకు అవసరమైన అభివృద్ధి పనులు చేయడమే ధ్యేయంగా పెట్టుకున్నామన్నారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా రెండోరోజు 28వ వార్డు షరాఫ్‌బజార్ యువనేత మనోజ్‌కుమార్‌రెడ్డి 286 గడపలను సందర్శించి, ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అదేవిధంగా 35వ వార్డు అమరావతినగర్‌లో ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి అధికారులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి 576 ఇళ్లను సందర్శించి ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రజల నుంచి వచ్చిన సమస్యలను వీలైనంత త్వరగా పరిష్కరిస్తామని, నిర్భయంగా సమస్యలను తమదృష్టికి తీసుకురావాలన్నారు. వార్డుల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఒక్కొక్క వార్డుకు రూ.20 లక్షలు చొప్పున మంజూరు చేస్తోందని, ఆ నిధులతో వార్డుల్లో రోడ్లు, కాలువలు, తాగునీటి వసతి, వీధిలైట్లు ఏర్పాటు తదితర సమస్యలు పరిష్కారిస్తామనా హామీ ఇచ్చారు. జగనన్న సీఎంగా ఉన్నంతవరకు ప్రతి లబ్ధిదారుడికి సంక్షేమ పథకాలు అందుతాయని, ఎవరూ అధైర్యపడవద్దని, అండగా మేముంటానని చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్, కార్పొరేషన్ల డైరెక్టర్‌లు పోలకల్ రేణుక, మంజుల, మున్సిపల్ చైర్‌పర్సన్ బోయశాంత, కమిషనర్ రఘునాథ్‌రెడ్డి, ఎంఈ నాగభూషణ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు దేవా, గౌరవాధ్యక్షుడు చంద్రకాంత్‌రెడ్డి, కౌన్సిలర్లు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

### జగనన్న సురక్షతో ప్రజల సమస్యలు పరిష్కారం


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి. పక్కనే ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్

ఆదోనిటౌన్ : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిష్టాత్మకంగా జూలై 1వ తేదీ నుంచి 31వ తేదీ వరకు అమలు చేసిన జగనన్న సురక్ష కార్యక్రమంతో ప్రజలకు ఎంతో మేలు జరిగిందని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి చెప్పారు. గురువారం అమరావతినగర్‌లో ఎమ్మెల్సీ డాక్టర్ మధుసూదన్‌తో కలిసి ఎమ్మెల్యే విలేకరులతో మాట్లాడారు. సాంకేతిక సమస్యలు, సర్టిఫికెట్‌లోటు మూలంగా సంక్షేమ పథకాలు అందని పేదలను గుర్తించడంతోపాటు ప్రజలకు అవసరమైన సర్టిషికెట్లు ఉచితంగా అందజేయడంతో ప్రతిఒక్కరూ సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. జగనన్నసురక్ష కార్యక్రమం ద్వారా ఆర్వోఆర్, అడంగళ్, లీగల్ సర్టిఫికెట్లు, పాత, కొత్త రేషన్‌కార్డుల విభజన, పక్కా ఇళ్ల మంజూరు, క్యాస్ట్, ఇన్‌కమ్, మ్యారేజ్ సర్టిఫికెట్లు తదితర పది రకాల సర్టిఫికెట్లను ఒకటి, రెండు రోజుల్లోనే ఉచితంగా, సులువుగా ప్రజలకు అందజేయడం జరిగిందన్నారు. వ్యయప్రయాసాలతో తహసీల్దార్, వీఆర్వో, మున్సిపల్ కార్యాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేసినా పరిష్కారం కాని సమస్యలు అత్యంత సులువుగా పరిష్కరిస్తూ వలంటీర్లు ప్రజల ఇళ్ల వద్దకే వెళ్లి సర్టిఫికెట్లను పంపిణీ చేయడం జరిగిందన్నారు. జగనన్నకు 2024లో ఆశీర్వదించి మరోసారి పట్టం కట్టాలని కోరారు. నాలుగేళ్ల పాలనలో ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చి 50 శాతం అదనంగా కొత్త హామీలను ఇస్తూ వెనువెంటనే నెరవేర్చిన ఘనత జగన్‌మోహన్‌రెడ్డికే దక్కిందని ఎమ్మెల్యే కొనియాడారు.

### నాటుసారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

ఆదోనిరూరల్ : ఆదోని పట్టణం బావాజీపేటకు చెందిన బోయ రవి అనే వ్యక్తి ఇస్వీ గ్రామ సమీపంలోని జోడి బసవేశ్వరస్వామి టెంపుల్ వద్ద కొండలో నుంచి అక్రమంగా నాటుసారా తరలిస్తుండగా అదుపులోకి తీసుకున్నట్లు ఇస్వీ ఎస్‌ఐ శ్రీనివాసులు తెలిపారు. అతని నుంచి పది లీటర్ల నాటుసారాను స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి, రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ తెలిపారు.

### గుడికంబాలిలో కంటి పరీక్షలు

కౌతాళం: మండల పరిధిలోని గుడికంబాలిలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సర్పంచ్ సిద్దేశ్ ఆధ్వర్యంలో గురువారం కర్నూలు అమీలియా ఆసుపత్రి వైద్యులు రోగులకు ఉచితంగా కంటి పరీక్షలు చేశారు. అవసరం మేర కు రోగులకు ఉచితంగా మందులు పంపిణీ చేశారు. 25మందికి ఆపరేషన్లు అవసరం కాగా వారిని కర్నూలుకు రెఫర్ చేసినట్లు చేసినట్లు వైద్యులు తెలిపారు.

### వైద్యవిద్యలో కన్వీనర్ కోటా సీట్ల తగ్గింపు సరికాదు

ఆదోని సెంట్రల్: వైద్యవిద్యలో కన్వీనర్ కోటా సీట్ల తగ్గింపు సరికాదని ఎఐఎస్‌ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి యస్. షాబీర్ భాష తెలిపారు. గురువారం పట్టణంలోని ఎమ్మిగనూర్ సర్కిల్ సెంటర్‌లో వైద్యవిద్య సీట్లపై నిరసన కార్యక్రమం చేపట్టారు. వారు మాట్లాడుతూ సీట్లను భర్తీ చేసే విషయంలో 50 శాతం సెల్ఫ్ ఫైనాన్స్, ఎన్‌ఆర్ కేటగిరిలకు కేటాయించడం వలన ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థులకు అన్యాయం జరగుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ డివిజన్ సహాయ కార్యదర్శి మల్లికార్జున, వీరేష్, లక్ష్మీనారాయణ, డివిజన్ ఉపాధ్యాక్షులు శివ, ఆకాష్,రవి తదితరులు పాల్గొన్నారు.

### సత్కారం


సీతారామిరెడ్డి, ప్రదీప్ రెడ్డిని కలిసి సన్మానించిన దృశ్యం

కోసిగి: కోసిగి మండలంలోని ఆర్లబండ సహకార సంఘం అధ్యక్షుడుగా బాధ్యతలు చేపట్టిన నాడుగేని నరసింహులు వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు సీతారామిరెడ్డిని, రాష్ట్ర యూత్ కమిటీ సభ్యుడు ప్రదీప్ రెడ్డి మర్యాద పూర్వకంగా కలిశారు. వారికి పూలమాలలు వేసి శాలువాలతో సత్కరించారు. సన్మానం చేశారు. కార్యక్రమంలో కోసిగి మండల వైఎస్సార్ సీపీ నాయకులు నాడుగేని నాగరాజు, దొడ్డి నరసన్న, బసిరెడ్డి, నాడుగేని రాముడు, బసవరాజు తదితరులు పాల్గొన్నారు.

### రెండు ఆటోలు ఢీ..

- కర్ణాటక భక్తుడి మృతి
- ఇద్దరు ఆటో డ్రైవర్లకు తీవ్ర గాయాలు


అభిషేక్(ఫైల్)

మంత్రాలయం రూరల్: మంత్రాలయం మండలం 52–బసాపురం గ్రామం వద్ద గురువారం రెండు ఆటోలు ఢీకొన్న ఘటనలో కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తుడు అభిషేక్(20) అక్కడిక్కడే మృతిచెందాడు. ఆటో డ్రైవర్లు నరసింహులు(దిబ్బనదొడ్డి గ్రామం), శ్రీహరి(కాచాపురం గ్రామం) త్రీవంగా గాయపడ్డారు. విషయం తెలుసుకున్న మాధవరం పోలీసు స్టేషన్ ఎస్‌ఐ కిరణ్‌బాబు ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన భక్తుడు అభిషేక్‌తో పాటు తమిళనాడుకు చెందిన మరో ఐదుగురి ప్రయాణికులతో తుంగభద్ర రైల్వే స్టేషన్ నుంచి మంత్రాలయానికి బయల్దేదారు. బసాపురం గ్రామం వద్ద ఎదురుగా వస్తున్న టాటా ఏసీ మ్యాజిక్ మోటర్ క్యాబ్ అతివేగంగా వచ్చి ప్రయాణికులతో వెళ్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటోలో కూర్చున్న ప్రయాణికుడు అభిషేక్(20) తీవ్రంగా గాయపడ్డాడు. తలకు బలమైన గాయం కావడంతో అక్కడిక్కడే మృతిచెందాడు. మిగిలిన ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఇద్దరు ఆటో డ్రైవర్లు త్రీవంగా గాయపడటంతో వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ప్రభుత్వం ఆసుపత్రికి 108 వాహనంలో తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

### వాటా కోసం..పంటను దున్నేశాడు!

పెద్దకడబూరు : తండ్రి ఆస్తిలో తనకు వాటా వస్తుందని 3నెలల పత్తి పంటను దున్నేసిన సంఘటన మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో చోటుచేసుకుంది. బాధితుడు వీరనాగప్ప గురువారం విలేకర్లకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన రోగెన్నకు నలుగురు కుమారులు. సర్వేనెంబర్ 110ఈ, 247లో నాకు, మా తమ్ముడు భీమేష్‌కు వాటాలు ఇవ్వగా మిగిలిన ఇద్దరు తమ్ముళ్లకు వేరే సర్వే నెంబర్‌లో భూమిని ఇచ్చారన్నారు. పై కనపరచిన సర్వే నెంబర్‌లో తాను దాదాపు 3నెలల క్రితమే పత్తిపంటను సాగుచేసుకున్నానన్నాడు. పూత, పిందె దశలో ఉన్న తన పంటను రెండో తమ్ముడు భీరప్ప తనకు కూడా వాటా వస్తుందని ట్రాక్టర్ సాయంతో దాదాపు అర ఎకరానికి పైగా దున్నేశాడని ఆందోళన వ్యక్త చేశాడు. చేతికి వచ్చిన పంటను సొంత తమ్ముడే ఇలా చేయడం చాలా బాధాకరమని వాపోయాడు. పోలీసులు తనకు న్యాయం జరిగేలా చూడాలని వేడుకున్నాడు.